క్లుప్తంగా

25లోగా సొసైటీ రుణాలు చెల్లించాలి

శావల్యాపురం: సొసైటీ బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని వినుకొండ సొసైటీ బ్యాంకు మేనేజరు బత్తుల బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూవినుకొండ నియోజకవర్గంలో ఎనిమిది సొసైటీ బ్యాంకులు ఉండగా రూ.129 కోట్లు రైతులకు వ్యవసాయ అనుబంధ రుణాలను మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రూ.40 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. ఈనెల 25 లోగా తీసుకున్న రుణాలను చెల్లించాలని లేని పక్షంలో ప్రభుత్వ పరంగా వచ్చే రాయితీ నగదు కోల్పోతారని, అదనంగా వడ్డీ చెల్లింపులతో పాటు అపరాధ రుసుం ఉంటుంద న్నారు. శావల్యాపురం సొసైటీ పరిధిలో రూ.40 కోట్లు రుణాలను మంజూరు చేయగా రూ. 5 కోట్లు రైతులు చెల్లింపులు చేశారన్నా రు. ఆయనతో పాటు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు ఉన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్య రానివ్వం

శావల్యాపురం: వేసవిలో విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా ఉండేందుకు ముందుస్తు చర్యలు చేపట్టినట్లు ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను సందర్శించి ఏడీఏ మాట్లాడుతూ మండలాల వారీగా విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా గ్రామాల్లో ఒవర్‌లోడ్ కల్గిన ట్రాన్స్‌ఫార్మన్లు గుర్తించి ఈనెలాఖారులోగా అదనంగా ట్రాన్స్‌ఫార్మన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏఈ సంపెంగుల గాంధీ ఉన్నారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ డీఈ కె.కోటేశ్వరరావు సోమ వారం తెలిపారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ గ్రామస్తులు సహకారంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామంలో ప్రధాన కూడలి మర్గాం నుంచి ఎస్సీ కాలనీ వరకు 600 మీటర్ల సీసీ రోడ్డు పనులు జరగుతాయని, సీసీరోడ్డు వెడల్పు 5 మీటర్ల, 8 అంగుళాల మందంతో పనులు పది రోజుల వ్యవధిలో పూర్తి అవుతాయన్నారు. అనంతరం 20 రోజుల పాటు సీసీ రోడ్డు వాటర్ క్యూరింగ్ చేపడతామన్నారు. గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి నెలకొనియు న్న సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు అభినందనలు తెలిపారు.ఆయనతో పాటు పంచా యతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, సర్పంచ్ పోపూరి జ్యోతి, వైఎస్ ఎంపీపీ ప్రభావతి, గ్రామస్తులు ఉన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం

చిలకలూరిపేట టౌన్: ఇన్నర్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుంటూరు సౌజన్యంతో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్, పోగ్రామ్ కో ఆర్డినేటర్ గట్టు సరోజిని, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్ జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని గాంధీపేటలో ఉన్న డాక్టర్ గట్టు రంగారావు ఆసుపత్రి లో ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో రూ.4 వేలు విలువ చేసే పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, వేలూరు డొంక, తూర్పు మాలపల్లె, శారదా హైస్కూల్ రోడ్డు, కావమ్మగుడి రోడ్డు, కొమర వల్లిపాడు, పాటిమీద ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సచివాలయాల్లో 80 శాతం హాజరు ఉండాలి

శావల్యాపురం: స్థానిక గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయా ల్లో సిబ్బంది హాజరు 80 శాతం ఉండాలని సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించటం పాటు నెలకు 250 సర్వీసులు తగ్గకుండా బాధ్యత వహించాలన్నారు. సేవలకు సంబంధించిన నగదు సకాలంలో జమ చేయాలన్నారు. రొంపిచర్ల గ్రామంలో స్వచ్ఛ సంపద కేంద్రాల నిర్వహణపై స్వచ్ఛ సంపద కేంద్రం ప్రాంగణంలో ఈనెల 7వ తేదీన ఉదయం ఒక రోజు శిక్షణ తరగతులు జరుగుతాయని మండలంలోని వేల్పూరు, కారుమంచి గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, క్లాప్ మిత్రలు సచివాలయ ఇంజినీరు సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పేరు మీనా సీతారామ య్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి న్యాయం చేశారు

- 14వ వార్డు గడపగడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సోమవారం రాత్రి పట్టణంలోని 14వ వార్డు కంభంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు సీనియర్ నాయకులు కాకుమాను మంగపతి రెడ్డి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి సారథ్యంలో మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సతీష్, పాతర్లంక చిన్ని, తలారి నాని, బండి వెంకటేశ్వర రెడ్డి, బూదాల కిరణ్, పరుచూరి సురేష్, బాల రాజు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన పలువురు టీడీపీ కార్యకర్తలకు కండువాలను కప్పి పార్టీలోకి హృదయ పూర్వకంగా ఆహ్వానించారు. మరికొంతమందికి జగనన్న కాలనీల్లో పట్టాలు మంజూరైన లబ్ధిదార్లకు ఇళ్లపట్టాల పత్రాలను అందజేశారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. వార్డు పరిధిలోని 80 మందికి ఇళ్లపట్టాలు, మరికొంతమంది టిడ్కో గృహాలు ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటివరకు వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. వీటిని గుర్తుపెట్టుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చేయాలని కోరారు.

కార్యక్రమంలో పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డీఇ ఓలేటి శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణ రాజు, ఆర్ఐ సూర్యనారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఇ సురేంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల అశోక్, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్‌కే ఆంజనేయులు, పట్టణ ఉపాధ్యక్షులు జి.అచ్యుతరావు, రామిసెట్టికొండ, సీనియర్ నాయకుడు ఇప్పల దానారెడ్డి, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జి, నెలటూరి మురళి, షేక్ కరిముల్లా, డాక్టర్ బి.హనుమకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వార్డులోని ప్రజలకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

కృష్ణకు సేవానంది అవార్డు పురస్కారం



కృష్ణకు అవార్డు అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

రొంపిచర్ల: మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన ఏనుగంటి కృష్ణకు విజయవాడ మహిళా వాసు వాకర్స్ క్లబ్, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విశిష్ట సేవానంది పురస్కారాన్ని అందజేశారు. విజయవాడలోని కన్యకాపరమేశ్వరి కమిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి ఈ పురస్కారాన్ని కృష్ణకు అందజేశారు. 17 సంవత్సరాల వయస్సులోనే విద్యుత్ షాక్‌కు గురై రెండు కాళ్లు కోల్పోయి ఆత్మవిశ్వాసంతో జీవనం సాగిస్తూ సాటి వికలాంగులలో మనోధైర్యం నింపారన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ శారద, అధ్యక్షురాలు లలితా రాణి పాల్గొన్నారు.

మోసగించబోయి.. దొరికిపోయాడు!

- అడ్డంగా చిక్కిన శనగల వ్యాపారి
- రిమోట్ కంట్రోల్ ఎలక్ట్రానిక్ కాటాతో బస్తాకు 8 కేజీల తరుగు!
- తప్పు ఒప్పుకుని కొందరికి నగదు చెల్లింపు

నాదెండ్ల: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అడ్డగోలుగా దోచుకునేందుకు ప్రయత్నించిన వ్యాపారి దొరికిపోయిన సంఘటన మండలంలోని అప్పాపురం గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల మేరకు యడ్లపూడి మండలం చిమటావారిపాలెం గ్రామానికి చెందిన గనివిశెట్టి మణి గణపవరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటూ శనగల వ్యాపారం చేస్తుంటాడు. రైతుల నుంచి శనగలను కొనుగోలు చేసి యితర వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. స్థానిక రైతుల నుంచి నాలుగు లోడ్లు పైగా శనగలు కొనుగోలు చేశాడు.

ఈ నెల 4,5 తేదీల్లో మండలంలోని అప్పాపురం గ్రామంలో కొందరు రైతుల నుంచి క్వింటా రూ.4,400ల చొప్పున చెల్లించేలా మాట్లాడుకున్నాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న రిమోట్ ఎలక్ట్రానిక్ కాటా యంత్రంతో కాటాల్లో రైతులను మోసగించేందుకు యత్నించాడు. ఒక్కో బస్తాకు రిమోట్ కంట్రోల్ ద్వారా 7–8 కేజీలు తస్కరించేందుకు ప్రయత్నించాడు. అయితే సోదరులైన ఇరువురు రైతులు కాటాల్లో తేడా వస్తుండటంతో గమ నించి, మరో కాటాతో తూకం వేశారు. దీంతో ప్రతి బస్తాకు 7–8 కేజీల చొప్పున తక్కువ వేస్తున్న ట్లు గుర్తించారు. దీంతో రైతులు వ్యాపారిపై తిరగబడటంతో, మోసాన్ని అంగీకరించి ప్రతి రైతుకు 8 కేజీల చొప్పున నగదు చెల్లించాడు.

ఇదే క్రమంలో గతంలో అతనికి శనగలు విక్రయించిన రైతులు తమనూ కాటాల్లో మోసగించాడని వాపోయారు. వ్యాపారిని కలిసేందుకు ప్రయత్నించగా అతను అందుబాటులో లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమౌతున్నారు.

దంత పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

చిలకలూరిపేటటౌన్: ప్రతి రోజూ క్రమం తప్పకుండా రెండు సార్లు దంతధావనం చేయాలని దంతవైద్యులు పేర్ని కృష్ణమోహన్ చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ హాస్టల్, పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ దంతవైద్య దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంతాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు బ్రెష్, పేస్ట్, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. దంతాల పరిరక్షణ ఎంతో ముఖ్యమని వివరించారు. అనంతరం డాక్టర్ కృష్ణమోహన్‌ను సంస్థ సభ్యులు సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరుమళ్ల శివ, మురళి, సొసైటీ అధ్యక్షుడు దాసరి చిట్టిబాబు, గేరా యోకోబు, పొనుగుబాటి బుల్లిబాబు, దార్ల బుజ్జిబాబు, నల్లపు కోటేశ్వరరావు, దార్ల రమేష్ పాల్గొన్నారు.

తిరునాళ్ల భక్తులకు ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీ పరిధిలోని సంగంగోపాలపురంలో వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. స్థానిక పంచాయతీ ప్రజలే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శించుకుని అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎ.కోటేశ్వరరావు, హెచ్‌వీ గంగానమ్మ, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేశ్వర రెడ్డి, ఏఎన్‌ఎంలు థామసమ్మ, బుజ్జి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొని వైద్యసేవలు అందజేశారు.

కౌన్సిలర్ గౌరవ వేతనం వితరణ

సత్తెనపల్లి: పట్టణంలోని 24వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ తన ఉదారతను చాటుకున్నారు. తన గౌరవ వేతనాన్ని ప్రతి నెలా తన వార్డులోని ఒక పేద కుటుంబానికి అందజేస్తున్నారు. ఈ నెలలో వచ్చిన వేతనాన్ని వార్డులోని పులిపాటి వెంకటేశ్వర్లు కుటుంబానికి అందించారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగారపు నవీన్, జవంగుల సాయి, సముద్రాల నరసింహారావు, దామెర్ల జగన్మోహన్‌రావు, జింకా పుల్లారావు, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాద్, మండవ శివసాయి, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం .. కంభంపాలెం వద్ద సుమారు 60 సంవత్సరాల వయస్సు గల మహిళ రైలు పట్టాలపై మృతి చెంది ఉందన్న సమాచారం మేరకు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ టి.సుబ్బారావు తెలిపారు. మృతురాలి మెడలో ఏసుప్రభు బొమ్మ లాకెట్ ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మృతురాలి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వేల్పూరులో వైభవంగా బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సతీమణి ఆదిలక్ష్మి దంపతులు, కుమారుడు బొల్లా శ్రీనివాసరావు, గిరిబాబు దంపతులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారీ డివి. మారుతీ రామచార్యులు, రత్నకర్ సాయిమాధవచార్యులు, వెంకట శేషాచార్యులు, సాత్వీక్ వేదమంత్రాలు, మేళతాళాల నడుము వేడుకలు తొలిరోజు భూ పూజ, నవధాన్యలతో అంకురార్పణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 7న స్వామి వారికి అభిషేకాలు, ధ్వజరోహణ, శేషవాహనంపై ఊరేగింపు, 8న దంపతులచే హోమాలు, చివరిరోజు 9వ తేదీన అన్నదాన కార్యక్రమం సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్రు రాఘవరావు, తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, సాదినేని చిన వెంకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునాళ్ల వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఆలయం లోని స్వామి వారి మూలవిరాట్

యడ్లపాడు: మండలంలోని సంగంగోపాలపురం– చెంఘీజ్‌ఖాన్‌పేట పరిధిలో కొండవీడు కొండల దిగువన ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి 39వ తిరునాళ్ల మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. వేకువ జామునుంచే ఆలయానికి భక్తులు బారులుదీరారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, బోయపాలెం గ్రామస్తులే కాకుండా సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. వార్షిక వేడుకల సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, నూతన పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకారకృతుడై భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ ప్రాంగణం దిగువన ఉన్న స్వామివారి విగ్రహం వద్ద పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. చెంఘీజ్ ఖాన్‌పేట పంచాయతీ ఆధ్వర్యంలో తిరునాళ్ల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస గ్రామాలకు చెందిన పెద్దల సమన్వయంతో తిరునాళ్ల ఏర్పాట్లు భారీగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి కొత్త రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక ప్రసాదాలను వితరణ గావించారు. ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రికి భారీ విద్యుత్ ప్రభలతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

9 నుంచి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



మహంకాళి అమ్మవారు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం 48వ తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్నాయి. 9వ తేదీ గురువారం ఉదయం పూజా ద్రవ్యములతో ఆలయ ప్రవేశం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 10వ తేదీ శుక్రవారం అమ్మవారికి పొంగళ్లు, పసుపు కుంకుమలు సమర్పణ, సాయంత్రం 6.30 గంటలకు ఇస్సప్పాలెంలో అమ్మవారి గ్రామోత్సవం, 11వ తేదీ ప్రధాన కలశ ఆలయ ప్రవేశం, ఉత్సవ పుర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు అన్న సమారాధన, సాయంత్రం జాగరణ కార్యక్రమం నిర్వహిస్తారు. తిరునాళ్లను పురస్కరించుకుని 9వ తేదీ రాత్రి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలు, కీర్తనలు ఏర్పాటుచేసినట్లు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి తెలిపారు.

వ్యర్థాల సేకరణపై శిక్షణ



చెత్త సేకరణపై వివరిస్తున్న డీపీఆర్‌సీలు

రొంపిచర్ల: గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్‌లు చెత్త సేకరణలో కనీస పద్ధతులు పాటిస్తే చెత్త నుంచి సంపదను సృష్టించటం సులవు అవుతుందని డీపీఆర్‌సీ అమరేశ్వరరావు అన్నారు. స్థానిక శిక్షణా కేంద్రంలో సోమవారం రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం గ్రామ సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహాల నుంచి చెత్త సేకరణలో గ్రీన్ అంబాసిడర్‌లు తీసుకోవల్సిన కనీస జాగ్రత్తలపై వివరించారు. గ్రామంలో చెత్త సేకరణ, అలాగే తొట్లలో తడిచెత్త నింపడం, తదితర విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణలో తెలుసుకున్న పద్ధతులను గ్రీన్ అంబాసిడర్‌లకు వివరించాలని ఆయన సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్ తిప్పగుడెశ జయమ్మ, గెల్లి చినకోటిరెడ్డి, విశ్వరూపాచారి, రొంపిచర్ల, దాచేపల్లి లియోపీఆర్‌లు విజయరామ్, మాధవి, వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మహిళా సాధికారత

- జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ
- వేర్వేరు చోట్ల ఘనంగా మహిళా దినోత్సవం



ఎంపీపీ తలతోటి రాణిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్

నాదెండ్ల: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళా సాధికారత సాధ్యమైందని జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో సోమవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు రాజకీయ, విద్య, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కల్పించారన్నారు. దీంతో ఎన్నో ఉన్నత స్థానాలకు మహిళలు ఎదిగారన్నారు. మహిళల పేరున రాష్ట్రంలో నివేశన స్థలాలు పంపిణీ చేసి గృహాలను నిర్మించటం వారి ఆర్థిక అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలను మహిళలకు నేరుగా అందించటంతో ఆయా పథకాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఎంపీటీసీ స్థానాల్లో సింహభాగం మహిళలకే కేటాయించారన్నారు. ఎంపీపీ తలతోటి రాణి మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు కల్పించిన రిజర్వేషన్ల వల్లే తాను ఎంపీపీ అయ్యానని చెప్పారు. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభించటం ఆయన చొరవతోనే సాధ్యమైందన్నారు. అంతేకాక మహిళల రక్షణకు దిశ చట్టం, దిశా పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటు, మహిళా పోలీసుల నియామకం ఎంతో గొప్ప ముందడుగన్నారు. జగనన్న చేదోడు, చేయూత, డ్వాక్రా మహిళలకు సంపూర్ణ రుణమాఫీతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడ్డారన్నారు. అనంతరం తహసీల్దార్ ఎ.వి.రమణ, ఎంపీపీ తలతోటి రాణి, సీడీపీవో శాంతకుమారి, సీసీలు ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, ఏసుదయమ్మ, ప్రవల్లిక, సీనియర్ యానిమేటర్లు సుజాత, అరుణ, సరోజినిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మ్యూజికల్ చైర్స్, లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఏపీఎం భరత్, ఎంఈవో ఆంజనేయులు, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీవో పుష్పరాజు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని గ్రామసచివాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ తౌషిద్ హుస్సేన్ సూచనల మేరకు మహిళలకు ప్రత్యేకంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి పారా లీగల్ వలంటీర్ వి.బాలాజీనాయక్, ఎంఎల్ఎస్‌సీ పి.అంజనాదేవిలు మహిళా సాధికారత, స్వీయరక్షణ తదితర అంశాలపై గురించి అవగాహన కల్పించారు. సమాన వేతనం, గౌరవమర్యాదలు కల్పించడం, కార్యాలయాల్లో పనిచేసే ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, గృహ హింస వంటి అంశాలపై చట్టపరమైన ఉచిత న్యాయ సహాయం పొందడం గురించి వివరించారు. కొన్ని విషయల్లో మహిళల పట్ల గోప్యత కలిగి ఉండుట, రాత్రి వేళల్లో మహిళలను పోలీస్‌స్టేషన్‌లో ఉంచరాదని, అసభ్య పదజాలంతో దూషిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎక్కడి నుంచి అయినా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ, ఎంపీడీవో టి.పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, ఆర్.పద్మజారాణి, షేక్ మస్తాన్ బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



బొల్లాపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

వినుకొండలో.....

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 30 వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా పాల్గొని మహిళల గొప్పతనాన్ని గురించి వివరించారు. సమాజంలో మహిళలు పలు సవాళ్లను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని, మహిళలకు అండగా చట్టాలు, ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గీతాంజలి స్కూల్ నందు ఉమెన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తేళ్ల కృష్ణవేణి మాట్లాడుతూ సృష్టిలో స్త్రీని మించిన శక్తి ఏదీ లేదని, అట్టి స్త్రీని గౌరవించడం మన అందరి బాధ్యత అని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లులకు పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, కౌన్సిలర్